ప్రభుత్వ స్థలంలో రెవెన్యూ బోర్డు మాయం

విశాలాంధ్ర - ఆనందపురం: జాతీయ రహదారికి పక్కనే ఆనుకొని ఉన్న విలువైన స్థలాన్ని అక్రమార్కులు వదలడం లేదు. వివరాల్లోకెళ్తే మండలంలో గుడిలోవ వద్ద నేషనల్ హైవేకి ఆనుకొని ఉన్న ప్రభుత్వ వర్షాధార గెడ్డ స్థలంలో రెవెన్యూ అధికారులు పెట్టిన కొద్దిరోజులకే భూ బకాసురులు మాయం చేశారు. ఇదివరకు కాలువను కప్పేసి వేస్ట్ మెటల్‌తో కప్పేసి స్థలాన్ని చదును చేశారు. సమాచారం తెలుసుకున్న రెవెన్యూ అధికారులు ప్రభుత్వ స్థలంలో హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేసినా కొన్ని రోజులకే ఆగంతకులు బోర్డును మాయం చేశారు. దీనిపై రెవెన్యూ అధికారులు స్పందన ఎలా ఉంటుందో, అక్రమార్కులపై ఎలాంటి చర్యలు తీసుకుంటారో చూడాలి.

అధికారుల్లో బదిలీల భయం

ఐదేళ్ల వైసీపీ పాలనలో అక్రమాలపై ఆరా తీస్తారా...?

టీడీపీ కూటమి నేతలకు దగ్గరవుతున్న అవినీతి అధికారులు

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: ఏ ఎండకు ఆ గొడుగు పట్టే అధికారులు కొంతమంది ఇప్పుడు మళ్లీ టీడీపీ కూటమి నేతలు చుట్టూ ప్రదక్షణ మొదలుపెట్టారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో అడ్డదారిలో రెండు చేతుల అక్రమంగా సంపాదించిన అధికారుల గుండెల్లో గుబులు మొదలైంది. ఓ పక్క బదిలీ భయం వెంటాడుతుంటే, మరోపక్క ఐదేళ్ల పాలనలో తమ అక్రమాలపై విచారణ జరిపి ఆరా తీస్తారా అంటూ ఆందోళన చెందుతున్నారు. విశాఖ జిల్లాలో రెవెన్యూ అధికారుల్లో కొంతమందికి కంటిమీద కునుకు రావడం లేదు. వీఎంఆర్డీఏలో మరి కొంతమందికి వణుకు ప్రారంభమైంది. ఇక జీవీఎంసీలో కొంతమంది అధికారులు వైసిపి తరపున కొన్ని నియోజకవర్గాల్లో టికెట్ల కోసమే పైరవీలు చేయడం అందరికీ తెలిసిందే. నేరుగా అధికారులే వైసిపి పెద్దల కు అడుగులకు మడుగులెత్తి చక్రం తిప్పిన వారందరికీ ఇప్పుడు చుక్కలు తప్పవని ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా విశాఖ జిల్లాలో భూముల ఆక్రమణ, భూ కేటాయింపులు, వివిధ ప్రాజెక్టులకు దొడ్డి దారిలో అనుమతులు, రహదారుల విస్తరణ పేరుతో టిడిఆర్‌లు దోపిడీ, జివిఎంసి పాలకవర్గం లో అనేక అక్రమాలకు ఆమోదముద్ర పాల్పడిన అధికారులకు టిడిపి కూటమి ప్రభుత్వంలో చిక్కులు తప్పవని తీవ్ర ఆందోళన చెందుతున్నట్లు తెలుస్తోంది. విశాఖ జిల్లాలో ఐఏఎస్ అధికారుల దగ్గరుండి ఆ విభాగం ఉన్నతాధికారి వరకు చేసిన అక్రమాలపై ఇప్పటికే విచారణ చేస్తున్నట్లు సమాచారం. ఐదేళ్లలో అధికారుల అక్రమ సంపాదనతో పాటు వారు చేసిన దందా , గత ప్రభుత్వ పెద్దలకు వారు చేసిన మేలు అన్నింటిపై ఆరా తీస్తున్నట్లు తెలుస్తోంది. టిడిపి కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు ఈ నెల 12వ తేదీన ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత వెంటనే ఐఏఎస్, ఐపీఎస్ అధికారులతో పాటు వైసీపీ ప్రభుత్వంలో అక్రమాల అక్రమార్కులతో అంటగాగిన అధికారుల భరతం పడతారని విస్తృతంగా చర్చ సాగుతుంది. మరోపక్క శాంతి భద్రతల పరిరక్షించాల్సిన పోలీస్ అధికారులు సైతం పార్టీ నేతలకు వ్యక్తిగత కార్యకర్తల కొంతమంది అధికారులు వ్యవహరించిన తీరుపై కూడా టీడీపీ ప్రభుత్వం పరిగణలోకి తీసుకొని వారిపై చర్యలకు దిగుతుందన్న ఆందోళన ఈ అధికారుల్లో వ్యక్తమౌతుంది. వామ్మో తమకు ఇబ్బందులు తప్పవు అంటూ కొంతమంది అధికారులు తీవ్రంగానే ఆందోళన చెందుతున్నారు. తమని తాము రక్షించుకోవడానికి కూటమి ప్రభుత్వంలో గెలుపొందిన ఎమ్మెల్యేల వద్దకు వెళ్లి మమ్మల్ని రక్షించండి ఈ ఐదేళ్లు మీతోనే ఉంటామంటూ కొంతమంది అధికారులు ప్రాధేయ పడుతున్నట్లు విశ్వసనీయ సమాచారం ద్వారా తెలిసింది. గతంలో వైసిపి ప్రభుత్వానికి ఎలాగా నమ్మిన బంటుల పని చేసాము మీకు కూడా అలాగే పని చేస్తాం మమ్మల్ని రక్షించండి అంటూ వేడుకుం టున్నట్లు తెలుస్తోంది. బదిలీల పేరుతో తమకు ఉపయోగం లేని పోస్టు కట్టబెట్టకుండా విశాఖలోని అనుకూలమైన పోస్టులలో కొనసాగించాలని మరికొంతమంది పైరవీలు మొదలుపెట్టినట్లు సమాచారం. కొంతమంది అధికారులు కుల సమీకరణలు కూటమినేతలకు దగ్గర అవుతుండగా మరి కొంతమంది మిత్రుల ద్వారా రాయబారాలు నడిపి తమపై చర్యలకు పూనుకోవద్దు అంటూ వేడుకుంటున్నట్లు తెలుస్తుంది. ఏళ్ళు తరబడి విశాఖలోని విధులు నిర్వహిస్తున్న అవినీతి అధికారుల బదిలీకు మరోపక్క కొత్త ప్రభుత్వం సిద్ధమవుతున్నట్లు సమాచారం. రాష్ట్రంలోనే ముఖ్యమైన జిల్లాగా విశాఖపట్నం ఉంది. అమరావతి కన్నా విశాఖలోని విధులు నిర్వహించే అధికారులకు గిరాకీ ఉందని ప్రచారం.

జిల్లా కలెక్టర్, నగర పోలీస్ కమిషనర్, జాయింట్ కలెక్టర్, వీఎంఆర్డీఏ కమిషనర్, జీవీఎంసీ కమిషనర్, ఏపీ ఈపీడీసీఎల్ సిఎండి, జిసిసి ఎండి, పోర్టు చైర్మన్, ఫారెస్ట్ కన్జర్వేటర్, పోలీస్ శాఖలో డిసిపిలు, ఏసీపీలు, డిఆర్ఓ, ఆర్డీవోలు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, తహశీల్దారులు, జీవీఎంసీలో అదనపు కమిషనర్లతో పాటు వివిధ విభాగాల ఉన్నతాధికారులు, కలెక్టరేట్‌లో వివిధ విభాగాల వివిధ అధికారులు, వుడాలో వివిధ విభాగాధిపతులతోపాటు జిల్లాలో వివిధ శాఖల్లో ఉన్నతాధికారుల వంటి పోస్టులపై కొత్త ప్రభుత్వం సమగ్రంగా చర్చించి నిష్పక్షపాత అధికారులను కొనసాగిస్తూ అక్రమాలకు పాల్పడే అధికారులను బదిలీ చేస్తూ వారిపై న్యాయ విచారణకు కూడా ఆదేశించే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తున్నాయి. మొత్తానికి రాష్ట్రంలో అమరావతి కన్నా విశాఖలో విధులు నిర్వహించాలంటే కత్తి మీద సామేనని అధికారులు కూడా హడలి పోతున్నారు. ముందుకు వెళితే నుయ్యి వెనక్కి వెళ్తే గొయ్యి అన్న చందంగా అధికారులు తీవ్ర ఆందోళన చెందుతున్నట్లు తెలిసింది.

విచారణ జరిపి వెంటనే అరెస్ట్ చేయాలి

విశాలాంధ్ర - సింహాచలం: గ్రేటర్ విశాఖ తొలి పావంచా నుండి అడవివరం జంక్షన్ వరకు జరుగుతున్న రోడ్డు విస్తరణలో జరిగిన అవకతవకల్లో 98వ వార్డు కార్పొరేటర్‌ను అరెస్ట్ చేయాలని కాంగ్రెస్ నాయకులు పాసర్ల ప్రసాద్ డిమాండ్ చేశారు. బీఆర్‌టీఎస్ రోడ్డు విస్తరణలో జరిగిన అవకతవకలను సమర్థించిన కార్పొరేటర్‌ను కమిషనర్ అప్పటి ఎమ్మెల్యేతో పాటు అధికారులపై విచారణ జరిపి వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. తప్పు చేసిన వారిని అరెస్ట్ చేసినప్పుడే అలాంటి తప్పు మరొకరు చేయరని అన్నారు. భీమిలి శాసన సభ్యునిగా గెలిచిన గంటా శ్రీనివాసరావు బిఆర్‌టిఎస్ రోడ్డు విస్తరణలో నష్టపోయిన వారితో సమావేశం ఏర్పాటు చేసి న్యాయం చేయాలని కోరారు. తప్పులు చేసిన వారిని అరెస్ట్ చేసినప్పుడే బాధితులకు న్యాయం జరుగుతుందన్నారు.

రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ పదవికి గునిశెట్టి రాజీనామా

విశాలాంధ్ర - గోపాలపట్నం: గ్రేటర్ విశాఖ కుమారి కళ్యాణ మండపంలో 91, 92 వార్డుల కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా వైసీపీ మండల అధ్యక్షులు బెహరా భాస్కరరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ పదవికి గునిశెట్టి శ్రీనివాసరావు రాజీనామా చేశారు. ఈ కార్యక్రమంలో 92వ అధ్యక్షులు గొర్లె అప్పలస్వామి నాయుడు, గేదెల మురళీకృష్ణ, 91, 92 వార్డుల వైసీపీ నాయకులు, కార్యకర్తలు కన్వీనర్లు ఆర్పీలు, బూత్ కమిటీ సభ్యులు, వివిధ అనుబంధ సంస్థల మహిళలు పాల్గొన్నారు.

మెగా డీఎస్సీ ఫైల్‌పై చంద్రబాబు మొదటి సంతకం ?

రాష్ట్ర కాంగ్రెస్ ఓబీసీ డిపార్ట్మెంట్ చైర్మన్ మూల వెంకటరావు

విశాలాంధ్ర - పెందుర్తి: రాష్ట్ర నూతన ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టనున్న నారా చంద్రబాబు నాయుడు మొదటి సంతకం మెగా డీఎస్సీ ఫైల్ పైనే చేయాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాంగ్రెస్ ఓబీసీ డిపార్ట్మెంట్ చైర్మన్ మూల వెంకటరావు విజ్ఞప్తి చేశారు. మీడియాతో ఆయన మాట్లాడుతూ గత ఎన్నికలలో ఎన్డీఏ కూటమి ఇచ్చిన మొదట హామీపై మొదటి సంతకం చేసి తన నిజాయితీని నిరూపించుకోవాలని కోరారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్య మంత్రిగా ఉన్నప్పుడు 52 వేల పోస్టులతో మెగా డీఎస్సీ నిర్వహిం చారని, రాష్ట్ర విభజన తరువాత టీడీపీ ఆధ్వర్యంలో 7000 పోస్టులతో డీఎస్సీ నిర్వహించారని గుర్తు చేశారు.

గత ప్రభుత్వం అసలు డీఎస్సీ నిర్వహించలేదని పేర్కొన్నారు. ఉమ్మడి శ్రీకాకుళం, విజయనగరం, అనంతపురం, కర్నూలు వంటి ఆర్థికంగా వెనుకబడిన జిల్లాలలో మాస్టారు ఉద్యోగం పొందడం గొప్ప గౌరవంగా భావిస్తారని వెల్లడించారు. రాష్ట్రంలో బీఈడీ, డిఎడ్ పూర్తి చేసిన నిరుద్యోగులు 5 లక్షలకు పైగా ఉన్నారని, అలాగే టెట్ పరీక్షలకు అర్హత సాధించిన వారు 3 లక్షలకు పైగా ఉన్నారని, వారు ఎంతో ఆశగా కొత్త ప్రభుత్వంలో మెగా డీఎస్సీ నోటిఫికేషన్ కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. ఇప్పటికే కోచింగులు కోసం లక్షలాది రూపాయలు ఖర్చుపెట్టిన నిరుద్యోగులు ఉద్యోగాలు కోసం ఎదురుచూస్తున్నారని మూల వెంకటరావు తెలిపారు. గత ప్రభుత్వం లాగా కాకుండా బాగా చదువుకొని, అనుభవం ఉన్న వ్యక్తిని విద్యాశాఖ మంత్రిగాను, సౌమ్యు డుగా పేరుపొందిన ఐఏఎస్ అధికారిని విద్యాశాఖ సెక్రటరీగాను నియమించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

కళాశాల స్వయం ప్రతిపత్తిపై వర్క్ షాప్

విశాలాంధ్ర - మల్కాపురం: స్థానిక సెయింట్ ఆన్స్ డిగ్రీ కళాశాలకు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ స్వయం ప్రతిపత్తి హోదా ఇచ్చిన సందర్భంగా ఈ నెల 8, 9వ తేదీలలో కళాశాల స్వయం ప్రతిపత్తిపై రెండు రోజుల వర్క్ షాపును నిర్వహిస్తున్నారు. ఈ వర్క్ షాప్‌లో ప్రధాన వక్తగా ఆంధ్రప్రదేశ్ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హైయర్ ఎడ్యుకేషన్ ఎకడమిక్ ఆఫీసర్ డాక్టర్ శ్రీరంగం మాథ్యూ పాల్గొని ప్రసంగిస్తూ- నూతన విద్యా విధానం ప్రకారం ప్రతి ఒక్క కళాశాల క్రమక్రమంగా పనితీరులో నాణ్యతను ప్రదర్శిస్తూ, స్వయం ప్రతిపత్తిని పొందాలని అన్నారు. విశాఖ పారిశ్రామిక ప్రాంతంలో సెయింట్ ఆన్స్ కళాశాల స్వయం ప్రతిపత్తి పొందిన మొదటి కళాశాల అనీ, ఈ విజయం వెనక యాజమాన్యం, అధ్యాపకుల కృషి ఎంతో ఉందని ప్రశంసించారు. స్వయం ప్రతిపత్తి వల్ల కళాశాల తన సిలబస్‌ను తానే రూపొందించుకోవచ్చని, సమయానికి పరీక్షలను నిర్వహించి, ఫలితాలను ప్రకటించవచ్చని, స్థానిక అవసరాలకు అనుగుణంగా కోర్సులను ప్రవేశ పెట్టవచ్చని అన్నారు. కళాశాల నిర్వహణ లో బాధ్యతను, పారదర్శకతను ప్రవేశపెట్టాలంటే స్వయం ప్రతిపత్తి ఎంతో అవసరం అని ఆయన అన్నారు. అనంతరం స్వయం ప్రతిపత్తి విధానాలను గురించి, అకడమిక్ కౌన్సిల్ గురించి, బోర్డ్ ఆఫ్ స్టడీస్ ను గురించి, గవర్నింగ్ బాడీ గురించి ఆయన సవివరంగా తెలియజేశారు. ఈ వర్క్ షాప్‌లో సెయింట్ ఆన్స్ కళాశాల యాజమాన్య సభ్యులు, అధ్యాపకులు పాల్గొన్నారు. బృంద చర్చల ద్వారా అధ్యాపకులు తమ అభిప్రాయాలను తెలియజేశారు. కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ ప్రేమ కుమారి, కరస్పాండెంట్ సిస్టర్ గెసెల్లా సారథ్యం వహించారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: విశాఖ కాన్వెంట్ సమీపంలోని కులాస బార్ అండ్ రెస్టారెంట్ సమీపంలో పెద్ద డ్రైన్‌లో పడి వ్యక్తి మృతి చెందాడు. పోలీసులకు స్థానికులు తెలియజేయడంతో ఘటన స్థలానికి పోలీసులు చేరుకున్నారు. గెడ్డలో పడిపోయిన వ్యక్తిని బయటకు తీశారు. మృతుడు 45 వయస్సు కలిగి ఉండొచ్చని అంచనా వేస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి వివరాలు సేకరిస్తున్నారు.

గీతంలో పి.హెచ్.డి ప్రవేశాలకు దరఖాస్తులు

విశాలాంధ్ర - మధురవాడ: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం విశాఖపట్నం, హైదరాబాద్, బెంగళూరు ప్రాంగణాలలో 2024 - 2025 విద్యా సంవత్సరానికి గాను పి.హెచ్.డి ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు గీతం రీసెర్చి అండ్ డవలప్‌మెంట్ డైరెక్టర్ డాక్టర్ సత్యనారాయణ, వి.నందూరి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలోని ఇంజనీరింగ్, సైన్స్, ఫార్మశీ, మేనేజ్‌మెంట్, లా, సామాజిక శాస్త్ర విభాగాలలో పిహెచ్‌డి ఫుల్‌టైమ్ ప్రవేశాలకు గీతం రీసెర్చి ఎంట్రన్స్ టెస్ట్ (గ్రేట్)ను నిర్వహిస్తామని పేర్కొన్నారు. ప్రవేశ పరీక్షలో లభించే మార్కుల ఆధారంగా వ్యక్తిగత ఇంటర్వ్యూలను నిర్వహించి అర్హులైన వారికి ప్రవేశం కల్పిస్తామన్నారు. ఆసక్తి గల వారు గీతం వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తులను డౌన్‌లోడ్ చేసుకుని జూలై 14వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించాల్సిందిగా సూచించారు.

ఎం.వి.వి.ఎస్.మూర్తి రీసెర్చి ఫెలోషిప్:

గీతంలో పిహెచ్‌డి ప్రవేశాలు పొందిన వారిలో ప్రతిభ గల వారిని ఎంపిక చేసి వారికి నెలకు రూ.40 వేల చొప్పున డాక్టర్ ఎమ్.వి.వి.ఎస్. మూర్తి ఎక్సలెన్స్ రీసెర్చి ఫెలోషిప్‌ను మూడేళ్ళ పాటు అందజేస్తామని తెలిపారు. అలాగే గీతం జూనియర్ ఫెలోషిప్ కింది నెలకు రూ. 25 వేల రూపాయలను పరిశోధన కాలంలో అందిస్తామని తెలిపారు.

కేజీహెచ్‌లో పరిశుభ్రతకు పెద్దపీట

సిఎస్ఆర్ఎంఓ శంకర్రావు



విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: కేజీహెచ్ ఆస్పత్రిలో అనేక వార్డుల్లో పారిశుధ్యం క్షీణించి అప్రశుభ్రంగా ఉంటే వాటిని తక్షణమే ఆధునీకరణ పనులు చేపట్టి పరిశుభ్రతకు పెద్దపీట వేస్తున్నామని సి ఎస్ఆర్ఎంఓ డాక్టర్ శంకర్రావు తెలిపారు. కార్డియాలజీ విభాగంలో ఎంతో అపరిశుభ్రంగా ఉన్న ప్రాంతాలను గదులను యుద్ధ ప్రాతిపదికన శుభ్రపరచి రోగులకు మెరుగైన ఆహ్లాదకరమైన వాతావరణాన్ని పరిశుభ్రతతో అందజేస్తున్నట్లు ఆయన తెలియజేశారు. తాజాగా కార్డియాలజీ విభాగంలో ఉన్న వరండాలో పరిశుభ్రతకు ముందు తరువాత ఫోటోలను చూస్తే అర్థం పడుతుంది. ఇటీవలే సి ఎస్ఆర్ఎంఓగా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ శంకర్రావు అన్ని వార్డుల్లో పరిశుభ్రతతో పాటు రోగులకు మెరుగైన సదుపాయాలు అందించడంలో విశేష కృషి కనబరుస్తున్నారు. నూతన కేజీహెచ్ సూపరింటెండెంట్‌గా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ శివానందం సహకారంతో మెరుగైన వసతులు కల్పనకు కృషి చేస్తున్నారు.



డిసిఎంఎస్ పదవికి పొంద్రంకి అప్పారావు రాజీనామా

విశాలాంధ్ర - ఆనందపురం: సార్వత్రిక ఎన్నికల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఘోరఓటమి బాధతో విశాఖపట్నం జిల్లా కోపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ డీసీఎంఎస్ పదవికి ఆనందపురం మండలం నేలతేరు గ్రామానికి చెందిన సీనియర్ నాయకులు పొంద్రంకి అప్పారావు తమ పదవికి రాజీనామా చేస్తున్నట్లు పత్రికా ముఖంగా శనివారం తెలిపారు. తమ చైర్మన్ కూడా కోలా గురువులు రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. అలాగే తమ రాజీనామాను వెంటనే ఆమోదించవలసిందిగా కోరుతూ తమ రాజీనామా లేఖను పంపారు.

రామోజీరావుకు అశ్రునివాళి

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: ఈనాడు గ్రూప్ సంస్థల చైర్మన్ చెరుకూరి రామోజీరావుకు భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు నివాళులు అర్పించారు. ఎం.వి.పి. కాలనీలోని తన నివాసంలో శనివారం రామోజీరావు సంతాప సభ నిర్వహించారు. రామోజీరావు భౌతికంగా మన మధ్య లేకపోయినప్పటికీ తెలుగు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని ఈ సందర్భంగా గంటా అన్నారు. పత్రిక భాష స్థానంలో సామాన్యుడికి అర్థమయ్యే వాడుక భాషలో వార్తలను అందించి అందరికీ చెరువయ్యారని తెలిపారు. రామోజీరావు మృతికి సంతాపం వ్యక్తం చేస్తూ రెండు నిముషాలు మౌనం పాటించారు. కార్యక్రమంలో టీడీపీ ఇన్‌చార్జి కోరాడ రాజబాబు, కొయ్య ప్రసాదరెడ్డి, గంటా నూకరాజు, 98వ వార్డు కార్పొరేటర్ పి.వి.నరసింహం తదితరులు పాల్గొన్నారు.

రామోజీరావుకు విశాఖ ఎంపీ శ్రీ భరత్ సంతాపం

ఈనాడు అధినేత రామోజీరావు ఆకస్మిక మరణం పట్ల విశాఖ పార్లమెంట్ సభ్యుడు ఎమ్.శ్రీభరత్ తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. విశాఖకు రామోజీరావుకు ఈనాడు దినపత్రికకు గల దశాబ్దాల బంధం అజరామరం అని, పాత్రికేయ వృత్తిలో కొత్తఒరవడికి, తెలుగుభాషను సమర్థంగా పాత్రికేయ వృత్తి ద్వారా తెలుగు నేలపై విస్తరింపజేసిన ఘనత రామోజీరావుదేనని శ్రీభరత్ పేర్కొన్నారు. ఈనాడు, ఈటీవీ, తెలుగు-వెలుగు, చతుర, సితార, ఈటీవీ భారత్ వంటి మాధ్యమాల ద్వారా తెలుగు వారి హృదయాలను దోచుకోవడమేకాక ప్రపంచ ప్రఖ్యాత రామోజీ ఫిల్మ్ సిటీ నిర్మాణం ద్వారా తెలుగు వారి సత్తాను రామోజీరావు చాటిచెప్పారని కొనియాడారు. రామోజీరావు లేని లోటు పూడ్చలేనిదని, ఎందరికో స్ఫూర్తి ప్రదాతగా నిలిచిన రామోజీరావు మృతి పట్ల సంతాపాన్ని వ్యక్తం చేయడంతో పాటు ఆయన కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని శ్రీభరత్ వ్యక్తం చేశారు.

పెదగంట్యాడ: అక్షర యోధుడు రామోజీరావుకి పెదగంట్యాడ సెంటర్‌లో పెదగంట్యాడ తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ఘన నివాళులర్పించారు. సంస్మరణ సభలో ముఖ్య అతిథిగా హాజరైన విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గ టీడీపీ ఉపాధ్యక్షులు పులి వెంకట రమణారెడ్డి రెడ్డి మాట్లాడుతూ రామోజీరావు సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో పెద గంట్యాడ టీడీపీ నాయకులు ములకలపల్లి పెంటయ్య, శ్రీముసిరి శ్రీనివాసరావు, పెద్దాడ సోము నాయుడు, దొమ్మేటి అప్పారావు, దొమ్మేటి పెరుమాళ్, ముద్దుర్తి సాంబ, పులి శ్రీరామ రెడ్డి, మొల్లి సోము నాయుడు, కేత మురళి, బత్తిన పెంటయ్య, పులి పెరుమాళ్ రెడ్డి, పులి అప్పల రెడ్డి, కోరిబిల్లి శ్రీను, జన సేన నాయకులు కోన చిన అప్పారావు, దొమ్మేటి అప్పారావు, యల్లబిల్లి గోవింద రావు, అప్పల స్వామి తదితరులు పాల్గొన్నారు.

భీమిలి: అక్షర ఆశాకిరణం, వార్తా రంగ దిగ్గజం, ఎంతోమందికి ఉపాధి కల్పించిన మహానుభావుడు, పద్మ విభూషణ్ పురస్కార గ్రహీత, ఈనాడు సంస్థల అధినేత

రామోజీరావు మృతి వార్త ఆంధ్ర ప్రజలను శోకసంద్రంలో ముంచిందనే చెప్పాలని టీడీపీ విశాఖ పార్లమెంటరీ సెక్రటరీ పిట్ట సురేష్ అన్నారు. రామోజీరావుకు సంతాప సభను ఏర్పాటు చేసి నివాళులర్పించారు. ఆయన పత్రికా రంగంలో, సినిమా రంగంలో ఆయనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని సృష్టించు కున్నారన్నారు. రాజకీయ రంగంలో ఆయన పేరు తలచుకోని నాయకుడు అంటూ ఉండరంటే ఆశ్చర్యం లేదన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు భీమవరపు ప్రకాష్, అద్దగర్ల రవికుమార్, కెత్తి ఆనంద్, పిట్ట రామారావు, మొండి కృష్ణ, పెండ్యాల మహేష్, పిట్ట రాంబాబు, చిన్ను, కిరణ్, సాయి తదితరులు పాల్గొన్నారు.

BEFORE THE HON'BLE DEPUTY REGISTRAR OF CHITS:;GUNTUR
(Application for reference of a Dispute to Arbitration)
DISPUTE.NO.112/2022

Between:
M/s.Chalapathi Chit Fund (P) Ltd., Guntur
Rep. by its Manager/Foreman
... Disputant
Vs
M/s. Buil Tech Enterprises, Rep.by Its Managing Partner and 6 others
...Opponents

To
Opp-6: Mr.Ajay Kumar Dugar S/o. Kantilal Dugar, A/a. 33Yrs., Partner of Ganapathi Marketing, Opp: Agartlal Former, Near Rama Talkies, Visakhapatnam.

Please take notice that the above Dispute is filed against Opponent No.6 and of you and 6 others for Recovery of Claim Amount and the same is posted on **26.06.24** for the Appearance of you Before the Hon'ble Deputy Registrar of chits, **Guntur at 2.00 pm.** If you fail on that day that day the matter will be heard and decided ex-party basis on the material available.

(By the order of The Deputy Registrar of Chits)

M/s.Chalapathi Chit Fund (P) Ltd., Guntur Rep. by its Branch Manager.

టీడీపీతోనే ఉజ్వల భవిష్యత్తు

విశాలాంధ్ర – భీమిలి: టీడీపీ, జనసేన, బిజెపి ఉమ్మడి ప్రభుత్వంతోనే ఉజ్వల భవిష్యత్తుకు శ్రీకారం చుడుతుందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు అన్నారు. కూటమి విజయోత్సవంలో భాగంగా భీమిలి జోన్ 3వ వార్డు మత్స్యకారుల గ్రామం బోయవీధిలో గంటా నూకరాజు సమక్షంలో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ సందర్భంగా గంటా నూకరాజు మాట్లాడుతూ ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రంలో ఉండే ప్రతీ ఒక్కరూ ఏమి కోల్పోయారో, ఎంత భయపడి బ్రతికారో చెప్పడానికి ఈమధ్య వచ్చిన సార్వత్రిక ఎన్నికల ఫలితాలే కారణమని అన్నారు. ఫలితాలు అనంతరం ఇంకా నారా చంద్రబాబు నాయుడు ముఖ్య మంత్రిగా ప్రమాణ స్వీకారం చేయకుండానే ప్రజలు గ్రామ గ్రామాన సంబరాలు చేసుకుంటున్నారని అన్నారు. కూటమి ప్రభుత్వంలో ప్రతీ ఒక్కరికీ మంచి జరుగుతుందనే భరోసా ఏర్పడిందని అన్నారు. బానిస సంకెళ్ళ నుండి ప్రజలకు విముక్తి లభించిందని అన్నారు. మూడు రాజధానులని మాయమాటలు చెప్పిన జగన్ రెడ్డి మాటలు ఎవరూ నమ్మలేదని అన్నారు. ఇప్పుడు స్వేచ్ఛా స్వాతంత్ర్య పాలనలో అందరూ సంతోషంగా ఉండాలని అన్నారు. ముఖ్యంగా మత్స్యకారులకు అనుక్షణం టీడీపీ అండగా ఉంటుందని చెప్పారు. మత్స్యకారుల యొక్క సమస్యలను గుర్తించే 50 ఏళ్లకే ఫించన్ ఇచ్చిన ఘనత నారా చంద్రబాబు నాయుడుదని అన్నారు. అదేవిదంగా ఈ ఎన్నికల్లో ప్రతీ ఒక్కరూ తనే అభ్యర్థి అయితే ఎలా ఉంటుందో అంత కంటే ఎక్కువగా కష్టపడి టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు కష్టపడి పనిచేశారని అన్నారు. అందుకే భీమిలి ఎమ్మెల్యేగా గంటా శ్రీనివాసరావుకి, ఎంపీగా శ్రీభరత్‌కి అత్యధిక మెజారిటీలు వచ్చాయని చెప్పారు. ఎన్నికల్లో ఎంతో కష్టపడి పనిచేసిన ప్రతీ ఒక్కరికీ ధన్యవాదములు అంటూ, అనుక్షణం మీకు అందుబాటులో ఉంటానని మంచి పనులు చేయించుకుందామని గంటా నూకరాజు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కాసరపు నాగరాజు, కాసరపు ఎల్లాజీ, కొక్కిరి అప్పన్న, కొక్కిరి నూకరాజు, కాసరపు ఎల్లాజీ, అరసవిల్లి అనిల్, తెడ్డు సింహాద్రి, వాడమొదలు తవుడయ్య, చింతపల్లి శ్రీను, చింతపల్లి చరణ్, కొక్కిరి రమణ, కొక్కిరి నాగరాజు, కొక్కిరి అప్పన్న, కాసరపు దానయ్య, కొక్కిరి నూకరాజు, కాసరపు పైడిరాజు, తెడ్డు అఖిల్, జనసేన నాయకులు కొక్కిరి కిషోర్, కొక్కిరి వీర్రాజుతో పాటు అధికసంఖ్యలో యువత పాల్గొన్నారు.

నాటకాల్లో సామాజిక సందేశం ఉంటుంది

రైటర్స్ అకాడమీ చైర్మన్ వీవీ రమణమూర్తి

విశాలాంధ్ర – విశాఖ కలెక్టరేట్: నాటకాల్లో సామాజిక సందేశం ఉంటుందని, నాటకాల ద్వారా ఎన్నో జీవిత పాఠాలు నేర్చుకోవచ్చుని రైటర్స్ అకాడమీ చైర్మన్ వీవీ రమణమూర్తి అన్నారు. నాటక రంగానికి ఇక్కడ చిన్న చూపు ఉన్న మాట నిజమే అని, కాని ప్రపంచంలో నాటక రంగం అగ్రస్థానంలో ఉందన్నారు. నవరస థియేటర్ ఆర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో టిఎస్ఆర్ కాంప్లెక్స్‌లోని రంగ సాయి నాటక గ్రంథాలయంలో శనివారం జరిగిన బాల బాలికల వేసవి నటశిక్షణా శిబిరం ముగింపు ఉత్సవానికి ఆయన ఆత్మీయ అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ పక్క రాష్ట్రం కర్ణాటకలో నాటక థియేటర్లు ఉన్నాయని, నాటకం చూడడానికి టికెట్టు రూ.200 ఉంటుందని తెలిపారు. ప్రారంభానికి ముందుగానే టికెట్లు అమ్ముడు అయిపోతా యన్నారు. అక్కడి ప్రభుత్వం కూడా నాటక రంగానికి మంచి గుర్తింపు ఇస్తుందన్నారు. అక్కడ పిల్లలకి నాటకానికి సంబంధించి పాఠశాలలోని క్లాసులలో ఒక తరగతి ఉంటు ందని తెలిపారు. అది ఏపీలో లేకపోవడం దురదృష్టకర మన్నారు. తమ మనవడు రీయాన్స్ ఈ శిక్షణ శిబిరంలో చేరి దుర్యోధనుడి పాత్ర వేసి అభినందనలు అందుకున్నారన్నారని ఆనందం వ్యక్తం చేశారు. నేడు ఇక్కడ కూడా నాటక రంగాన్ని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. ఢిల్లీలోని ఆడిటోరి యంలో ఇప్పటికీ కూడా నాటకాలు జరుగుతూ ఉంటాయని, టికెట్లు కొనుక్కొని ప్రేక్షకులు ఆసక్తితో వీక్షిస్తారన్నారు. ముఖ్యంగా నాటకాలను చూడడానికి యువత వస్తుంటారని చెప్పారు. ఆనాటి శ్రీకృష్ణదేవరాయలని నేడు మర్చిపోయిన, అష్ట దిగ్గజాలు పదిలంగా ఉన్నాయన్నారు. ప్రముఖ రంగస్థల నటులు, దర్శకులు కుప్పిలి వెంకటేశ్వరరావు, కుమారుడు ఏయూ రంగస్థల విభాగ పూర్వపు అధ్యాపకులు ప్రసాద్ మాట్లాడుతూ కన్యాశుల్కంలో ఎనిమిదో ఏటా నటించానని గుర్తు చేసుకున్నారు. పిల్లలకు నాటక రంగంలో శిక్షణ ఇవ్వడం అభినందనీయమన్నారు. వారిని కళాకారులుగా తీర్చిదిద్దడం గర్వించదగ్గ విషయం అన్నారు. నవరస మూర్తి, బాదంగీర్ సాయి కళా రంగానికి చేస్తున్న సేవలను కొనియాడారు. రంగస్థలం నటులు దర్శకులు కవి ప్రసాద్ మాట్లాడుతూ చిన్నారులను బాల నటులుగా తీర్చిదిద్దడంలో నవరస మూర్తి కృషి మరువలేనిది అన్నారు. ఆంధ్రాబ్యాంక్ సుబ్రహ్మణ్యం శిక్షణ పొందిన బాల నటులను రంగసాయి నాటక గ్రంథాలయం వ్యవస్థాపకుడు బాదంగీర్ సాయిని అభినందించారు.

ఆకట్టుకున్న చిన్నారి రియాన్స్ అభినయం

చిన్నారి రియాన్స్ దుర్యోధనుని ఏకపాత్ర అభినయం అందరినీ అలరించింది. కృష్ణుడు పాత్రలో కార్తికేయ, శకుని పాత్రలో రీమా, ద్రౌపది పాత్రలో నేహ, కీచకుని పాత్రలో ఎస్ విష్ణు, వాత్స్యాయని, వివిధ పాత్రల అభినయాన్ని బాలలు గాయత్రి, జయంతి, ఎన్టీ శ్రీనివాస్ కుమార్, ధనుష్, పివి రాజు, నిత్యశ్రీ, ఎస్ వి ఎన్ శ్రీరామ్, శ్రీకాంత్, యశ్వంత్, సౌమ్య, తనిష్క ప్రదర్శించారు. అనంతరం రైటర్స్ అకాడమీ చైర్మన్ రమణమూర్తి, అతిథులు కలిసి నవరస మూర్తి, రామ జోగారావు, బాలలను ఘనంగా సత్కరించారు. ప్రముఖ పాత్రి కేయులు ఎన్.నాగేశ్వరరావు అధ్యక్షత వహించిన కార్యక్ర మంలో హేమ, కుమారి హర్షిని, శ్రీకాంత్, తేజ, దుర్గారావు, జమ్మా చిన్న బాబు, వియ్యపు రామకృష్ణ, ఇమంది ఈశ్వర రావు, గాజువాక నూకరాజు, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు

దేశ ప్రయోజకులుగా నిలవాలి

రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు సీతారాం

విశాలాంధ్ర బ్యూరో – విశాఖపట్నం: భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు దేశ ప్రయోజకులుగా నిలవాలని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం అన్నారు. ఇటీవల మధ్యప్రదేశ్ పచ్చమ రహిలో గల భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ జాతీయ ట్రైనింగ్ సెంటర్‌లో నిర్వహించిన నేషనల్ అడ్వంచర్ ప్రోగ్రాంలో పాల్గొని శిక్షణ విజయవంతం చేసుకుని నగరానికి చేరుకున్న వివిధ పాఠశాలల విద్యార్థులకు శనివారం మద్దిలపాలెంలో జరిగిన ఒక కార్యక్రమంలో ప్రశంసా పత్రాలు అందజేసే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం చేతులు మీదుగా విద్యార్థులకు వీటిని అందజేశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో సీతారాం మాట్లాడుతూ భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ సంస్థ దేశంలో చక్కని క్రమ శిక్షణతో పాటు ప్రతిభా పాటవాలు కల్గిన సంస్థ అని నగరానికి చెందిన బాలాజీ ఇంగ్లీష్ మీడియం స్కూల్, సుజాత నగర్ డి.ఏ.వి.పాఠశాల విద్యార్థులు ఈ శిక్షణలో పాల్గొనేలా ప్రోత్సహించిన స్కూల్ యాజమాన్యాలు, వారి తల్లిదండ్రులను అభినందిస్తున్నట్టు చెప్పారు. ఇటువంటి భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ సంస్థలో శిక్షణ పొందడం వల్ల విద్యా, ఉద్యోగ రంగాల్లో కొంత శాతం రిజర్వేషన్లను ప్రభుత్వాలు కల్పించడం అదృష్టంగా భావించాలని అన్నారు. దీనిని స్ఫూర్తిగా తీసుకొని నగరానికి చెందిన అన్ని పాఠశాలల యాజమాన్యాలు, విద్యార్థుల తల్లిదండ్రులు మరింత మంది విద్యార్థులు చేరేలా ముందుకు రావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ విశాఖ జిల్లా కార్యదర్శి దాసరి వేణుగోపాల్, జిల్లా ఆర్గనైజింగ్ కమిషనర్ మారుతి హరీష్ కుమార్, చైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం విశాఖ నగర కార్యదర్శి కె.ఎల్లయ్య, విద్యార్థిని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వాలీబాల్ సమ్మర్ క్యాంప్ పిల్లలకు

టీ షర్టుల పంపిణీ

విశాలాంధ్ర – పీఎం పాలెం: విశాఖ జిల్లా భీమిలి నియోజకవర్గం మధురవాడ ఏడవ వార్డు పరిధిలో స్వతంత్ర నగర్ పబ్లిక్ పార్క్ వాలీబాల్ కోర్టులో ఫ్యూచర్ అసోసియేషన్ మధురవాడ వాలీబాల్ సమ్మర్ క్యాంప్ సందర్భంగా వాలీబాల్ కోచ్ రఘు ఆధ్వర్యంలో శనివారం వాలీబాల్ కోచింగ్ నేర్చుకునే చిన్నారులకు స్పాన్సర్స్ గ్రేహౌండ్స్ ఏఎస్ఐ జి. సన్నీ, సూర్య కుమారి దంపతులచే వాలీబాల్ నేర్చుకుంటున్న చిన్నారులకు టీ షర్టు, షాట్స్ సుమారు 50 మంది పిల్లలకు అందజేయడం జరిగింది. గుడ్లు, పాలు, అరటి పండ్లు, చిన్నారులకు అందజేశారు. ఈ సందర్భంగా వాలీబాల్ కోచ్ రఘు మాట్లాడుతూ క్యాంపు నిర్వహించి పదిమందితో ప్రారం భించి సుమారు 50 మంది పిల్లలు వరకు తమ వద్ద నేర్చు కుంటున్నారని తెలిపారు. వివిఎస్ఆర్ వెంకట్, నాయుడు, మాకు ఎంతగా సహాయ సహకారాలు అందించారు. ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రఘు మాస్టర్, చిన్న, జయరాం, ఆకాష్, సురేష్, ఆనంద్, శ్యామ్, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

నీట్‌లో ఉత్తమ ర్యాంకులు సాధించిన ఆకాష్ ఎడ్యుకేషనల్ సర్వీసెస్ విద్యార్థులకు సత్కారం

విశాలాంధ్ర–విశాఖ సిటీ : ఇటీవల విడుదలైన నీట్ ఫలితాలలో ఉత్తమ ర్యాంకులు సాధించిన ఆకాష్ ఎడ్యుకేషనల్ సర్వీసెస్ విద్యార్థులను సంస్థ కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. 696 మార్కులు సాధించి 2519 ర్యాంకును సాధించిన సత్య శ్రీ సహా 32 మంది విద్యార్థులను తెల్లకోటు, పుష్పగుచ్ఛం, మెమెంటో, పూలదండలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆకాష్ విద్యాసంస్థల డిప్యూటీ డైరెక్టర్ ఆర్ వి ఎస్ మూర్తి మాట్లాడుతూ దేశంలో అత్యున్నత ర్యాంకులు సాధించడంలో ఆకాశ విద్యార్థులు ముందంజలో ఉందన్నారు. 720కి 720 సాధించిన 21 మంది ఆకాష్ విద్యార్థులేనని తెలిపారు. అదేవిధంగా 100 లోపు ర్యాంకులలో 30 ర్యాంకులు ఆకాష్ సొంతం చేసుకుందని వెల్లడించారు. ఆల్ ఇండియా స్థాయిలో ఉత్తమ ర్యాంకులు సాధించి తమ ప్రతిభను నిరూపించుకున్నారని తెలిపారు. విశాఖలో 13 మంది విద్యార్థులు పదివేల లోపు ర్యాంకులు సాధించి సమస్త ప్రతిష్టను నిలబెట్టారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు ఫ్యాకల్టీ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని మేళ తాళాల మధ్య డాన్సులతో ఉత్సాహంగా విజయోత్సవ వేడుకలు నిర్వహించుకున్నారు. కార్యక్రమంలో సంస్థ అకాడమిక్ ప్రతినిధులు లక్ష్మీనారాయణ ,ఈశ్వరీ ప్రసాద్, సేల్స్ హెడ్ నిశాంత్ మిశ్రా , బ్రాంచ్ హెడ్ రాజేష్ తదితరులు పాల్గొని విద్యార్థులను అభినందించారు.

మహోన్నతమైన వ్యక్తి కామ్రేడ్ పర్సా

విశాలాంధ్ర – విశాఖ కలెక్టరేట్: ఆంధ్ర రాష్ట్ర కార్మిక ఉద్యమంలో మహోన్నతమైన వ్యక్తి కామ్రేడ్ పరస సత్యనారా యణని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్కేఎస్‌వి కుమార్ కొనియాడారు. శనివారం సిఐటియు ఆఫీసులో సిఐటియు జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ముం దుగా ఇటీవల మరణించిన అంగన్వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కామ్రేడ్ తులసి, తూర్పుగోదావరి జిల్లా సిఐటియు ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ రాజులోవ చిత్రపటాలకు పూల మాలలు వేసి ఘనంగా నివాళు లు అర్పించారు. అనంతరం సిఐటియు ఆంధ్ర రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు కామ్రేడ్ పరస సత్యనారాయణ శత జయంతి ఉత్సవాల సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కుమార్ మాట్లాడుతూ పరస సత్యనారాయణ ఆంధ్ర రాష్ట్ర కార్మిక ఉద్యమంతో మమేకమై నారన్నారు ఆయన జీవితం అనేక ఆటుపోట్లను ఎదుర్కొం దన్నారు. సింగరేణి బొగ్గు గనులలో ప్రారంభమైన ఆయన ప్రస్థానం రాష్ట్ర కార్మికు ఉద్యమానికి దిక్సూచిగా నడిచిం దన్నారు. 1970లో సిఐటియు ఏర్పడినప్పుడు ఆంధ్ర రాష్ట్ర మొదటి అధ్యక్షుడిగా కామ్రేడ్ పరస సత్యనారాయణ ఎన్నికయ్యారని, విశాఖపట్నంలో కార్మిక ఉద్యమ నిర్మాణంలో ఆయన కీలక పాత్ర పోషించాడన్నారు. కార్మికలోకం మాసస పత్రికను తీసుకురావడంలోనూ దాన్ని పంపిణీ చేయడంలోనూ ఆయన పాత్ర చాలా కీలకమన్నారు. కార్మిక వర్గాన్ని ఒక వర్గంగా ఐక్యం చేయాలంటే ప్రత్యేకంగా ఒక పత్రిక ఉండాలన్న అవసరాన్ని ఆయన నొక్కి చెప్పారన్నారు. ఆయన శత జయంతి ఉత్సవాల సందర్భంగా పరసగారి జీవిత విశేషాలతో పుస్తకాన్ని సిఐటియు రాష్ట్ర కమిటీ ముద్రించిందని, ఆ పుస్తకాన్ని ప్రతి కార్యకర్త చదవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ జిల్లా కమిటీ సమావేశంలో ఆ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు యు.రామస్వామి, కేయం కుమార్ మంగళం, పి వెంకట్ రెడ్డి, వై.రాజు, జి.అప్పలరాజు, కార్యదర్శులు ఎం జగ్గు నాయుడు, బి.జగన్, ఎం సుబ్బారావు, యూ.రాజు, ఓ అప్పారావు, ఆర్.లక్ష్మణమూర్తి, ఎస్ పద్మ, మంగశ్రీ, కొండమ్మ, తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు

విశాలాంధ్ర – పెందుర్తి: పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలోని సుజాతనగర్, పాపయ్యరాజుపాలెం ప్రాంతానికి చెందిన స్వయంవరపు ఆంజనేయులు అనే వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ ప్రకాశ్ తెలియజేశారు. గత నెల 28న రాత్రి 10 గంటల సమయంలో ఇంటినుండి బయిటకు వెళ్లిన ఆంజనేయులు తిరిగి రాలేదని, అతని మరదలు స్వయంవరపు ఉమ ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఆంజనేయులు మూర్ఛవ్యాధి, మతిస్థిమితం లేకపోవడం వంటి సమస్యలతో బాధపడుతున్నాడని ఆమె తన ఫిర్యాదులో పేర్కొన్నట్లు ప్రకాశ్ వెల్లడించారు. ఈ మేరకు సిఐ రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు బాధ్యతలను తనకు అప్పగించినట్లు తెలిపారు. ఆంజనేయులు ఆచూకీ తెలిసిన వారు పెందుర్తి పోలీసులకు సమాచారం అందించాలని ఆయన కోరారు.

గాయిత్రీ ఆలయ వార్షికోత్సవం

విశాలాంధ్ర – పెందుర్తి: జీవీఎంసీ 93వ వార్డు, నాయుడుతోట కూడలి వద్ద గల ప్రఖ్యాత ఆధ్యాత్మిక కేంద్రం విశాఖ శారదాపీఠం పాలిత గాయిత్రీ అమ్మవారి ఆలయ ద్వితీయ వార్షికోత్సం శనివారం వైభవంగా జరిగింది. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త రాపర్తి కన్నా ఆధ్వర్యంలో వేదపండితులు అమ్మవారికి హెూమం జపాదులు నిర్వహించారు. విశాఖ శారదాపీఠాదిపతులు స్వరూపానందస్వామి, ఉత్తరాదికారి స్వాత్మానందస్వామి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే గణబాబు తదితర రాజకీయ ప్రముఖులు అమ్మవారి సేవలో పాల్గొన్నారు.

మధురవాడలో కూటమి శ్రేణులు సంబరాలు..

విశాలాంధ్ర – పీఎం పాలెం: మధురవాడ జీవిఎంసీ ఏడో వార్డు టిడిపి సీనియర్ నాయకులు నాగోతి సూర్యప్రకాశరావు ఆధ్వర్యంలో టిడిపి, జెనసేన శ్రేణులు స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద ఉన్న ఎన్టిఆర్ విగ్రహానికి పూల వేసి ఘనంగా ఎన్టీఆర్‌కి నివాళులు అర్పించారు. అనంతరం ఆరోగ్య కేంద్రంలో ఉన్న వృద్ధులకు, పేషెంట్లకు పళ్ళు, ఫలహారాలు పంపిణీ చేసారు. అనంతరం శ్రీనివాస్ నగర్ లో వెలసిన శ్రీ వెంకటేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారికి 164 కొబ్బరికాయలు కొట్టి మొక్కులు సమర్పించుకున్నారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ ఈ సైకో జగన్ పరిపాలనలో గత ఐదు సంవత్సరాలు మా పార్టీ శ్రేణులకు అనేక రకాలుగా ఇబ్బందులకు గురిచేసారని దాని ఫలితంగా రాష్ట్రంలో సైకో అడ్రస్ లేకుండా చిత్తు చిత్తుగా ఓడి పోయాడని టిడిపి,జెనసేన, బిజెపి ఉమ్మడి కూటమి అధికారంలోకి రావడంతో మునిపటి కన్నా మా శ్రేణులు ఉత్సాహముతో ప్రజా సమస్యలపై పనిచేసి ప్రజలు మన్ననలు పొందుతామని అన్నారు. రానున్న పది సంవత్సరాలు అధికారంలో కొనసాగుతాయని తెలియజేసారు. విశాఖ పార్ల మెంటు కార్యదర్శి నాగోతి సూర్య ప్రకాష్,టిడిపి సినియర్ నాయకులు పిళ్ళా వెంకట్రావు రాష్ట్ర వాణిజ్య శాఖ కార్యదర్శులు ,పిళ్ళా నరసింగరావు 7వ వార్డ్ టీడీపీ అధ్యక్షులు ,కానూరి అచ్చుత రావు,సోం పాత్రుడు, పోతిన ప్రసాద్,కోల్లి చీరంజీవి,పొట్టి అప్పారావు,పిళ్ళా రాము,నాగోతి శివాజీ, 7వ వార్డు గంటా ప్రతినిది సోమిరెడ్డి రాజు, వెంకటరావు, నాగోతి సత్యనా రాయణ, 5వ వార్డ్ టీడీపీ అధ్యక్షులు .జనసేన నాయకులు నాగోతి నాయుడు, పోతిన తిరుమల రావు,గూడెల కామేశ్వరావు, పిళ్ళా శ్రీను, బిజెపి నాయకులు పసుపులేటి వాసు, సురేష్, ఆటో శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఎన్డీఏ కూటమి గెలుపులో

జన సైనికులు పాత్ర మరువలేనిది

విశాఖ జిల్లా రూరల్ కార్యదర్శి మజ్జి శ్రీను

విశాలాంధ్ర – ఆనందపురం: సార్వత్రిక ఎన్నికలలో జరిగిన ఎన్నికల్లో ఆంధ్ర రాష్ట్రం మొత్తంగా 164 సీట్లు ఎన్డీఏ కూటమిలో భాగంగా టీడీపీ, జనసేన, బిజెపి, కూటమికి రావడం ఆనందంగా ఉందని జనసేన విశాఖ జిల్లా రూరల్ కార్యదర్శి మజ్జి శ్రీను తెలిపారు. భీమిలి నియోజకవర్గంలో టీడీపీ కూటమి అభ్యర్థి గంటా శ్రీనివాసరావు కు ఇప్పటివరకు భీమిలిలో ఎన్నడు లేని ఈ విధంగా 92 వేలు పైచిలకు గెలవడం సంతోషంగా ఉందని, ఈ గెలుపులో జనసైనికులు నాయకులు ఎన్నికల సమయంలో పటిష్టంగా పనిచేశారని విజయంలో వారి పాత్ర కీలకం ముఖ్య భూమిక పోషించి కూటమి విజయానికి జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఆదేశాల పిలుపుమేరకు, భీమిలి జనసేన ఇంచార్జ్ సందీప్ ఆదేశాలతో జనసేన నాయకులు సైనికులు బలంగా పనిచేశారని వారి సేవలను కొనియాడారు. అలాగే టీడీపీ, బిజెపి నాయకులు తమ వంతుగా సహకారం అందించారని, కూటమి విజయంలో తమ వంతు పాత్ర పోషించారని, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధిని ఒక గాడిలో పెట్టేందుకు పనిచేస్తుందని, ఆంధ్ర రాష్ట్ర అభివృద్ధి అంటే కూటమితోని సాధ్యమని మజ్జి శ్రీను తెలిపారు.